క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మండపేట: ఏడిద, మారేడుబాక సబ్‌స్టేషన్ల ద్వారా విద్యుత్ సరఫరా అయ్యే గ్రామాలకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ కే రత్నాలరావు తెలిపారు. సబ్‌స్టేషన్లలో 132, 33 కేవీ లైన్ల మరమ్మతు పనులు చేపడుతన్నందున సరఫరాకు ఆటంకం ఏర్పడుతుందన్నారు.

'ఆదరణ'తో చేయూత



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అయ్యప్పనాయుడు

రామచంద్రపురం: ప్రభుత్వం వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం ఆదరణ-3 అమలు చేస్తుందని మునిసిపల్ కమిషనర్ వొమ్మి అయ్యప్పనాయుడు అన్నారు. ఆదరణ-3 పథకంలో భాగంగా కుల వృత్తిదారులకు మున్సిపాలిటీ స్థాయిలో సమావేశం నిర్వహించారు. ఆధునిక పనిముట్ల నాణ్యత కంపెనీ, ఏజెన్సీ వివరాలు సేకరించవలసిందిగా బీసీ కార్పొరేషన్ ఆదేశించినట్లు కమిషనర్ తెలిపారు. కుల వృత్తి దారులకు కావాల్సిన ఆధునిక పనిముట్లు వివరాలు అడిగి తీసుకొన్నారు. వివరాలను బి.సి కార్పొరేషన్‌కు తెలియజేస్తామని కమిషనర్ చెప్పారు. కులవృత్తి సంఘాల ప్రతినిధులు, వెల్ఫేర్ సెక్రటరీ, మేనేజర్ మూర్తి, బొమ్మల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఏడిద రోడ్డు మరమ్మతులు

మండపేట: భారీ గోతులు, గుంతల రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా మారిన ఏడిద రోడ్డుకు తాత్కాలికంగా మోక్షం లభించింది. పట్టణంలోని ద్వారకామయి హోటల్ దగ్గర నుంచి ఏడిద వయా దుళ్ల వరకూ ఈ రహదారి దారుణంగా మారింది. భారీ గోతులతో చిద్రంగా మారి ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోలేదు. ఎట్టకేలకు ఈ రోడ్డుకు మరమ్మతు పనులు గురువారం మొదలయ్యాయి. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చొరవతో రోడ్డు పనులను చేస్తున్నారు. అత్యవసర నిధులు కింద రూ.30 లక్షలు మంజూరు చేయించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. రోడ్డు భవనాల శాఖ ద్వారా టెండర్‌కు పిలవగా గుత్తేదారులు ముందుకు రాలేదన్నారు. దీనిపై జిల్లా పరిషత్ సమావేశంలో ఆ శాఖ అధికారులతో మాట్లాడి వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలని కోరినట్టు తెలిపారు. దీంతో ఎట్టకేలకు రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి.

గ్రామాల్లో ఉపాధి హామీ సోషల్ ఆడిట్



వెంకటాయపాలెంలో నివేదికలను చదివి వినిపిస్తున్న సోషల్ ఆడిట్ సిబ్బంది

రామచంద్రపురం రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ గ్రామ సభలు రెండో రోజు వెంకటాయపాలెం, ఉండూరు గ్రామాల్లో నిర్వహించారు. గతంలో వేసిన మొక్కలు చనిపోయాయని మళ్లీ వేయాలని, నూతన జాబ్ కార్డులు ఇవ్వాలన్న వినతులు ఈ గ్రామ సభల్లో అధికారుల దృష్టికి తీసుకునివచ్చారు. కార్యక్రమంలో ఏపీఓ మోర్త ఈశ్వరరావు, పరిశీలకులుగా ఎంఈఓ వాసంశెట్టి నాగేశ్వరి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఎస్ రాహుల్, సోషల్ ఆడిట్ డిస్ట్రిక్ట్ రిసోర్సుపర్సన్లు ఎస్.గోపి, డి.బాబూరావు, ఎన్ఆర్ఈజీఎస్ జేఈ కనకలత, వెంకటాయపాలెం సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, పంచాయతీ కార్యదర్శులు అరుణ, శ్రీనివాస్ అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

మెరుగైన సేవలే లక్ష్యం

కపిలేశ్వరపురం: సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య, ఆరోగ్య సేవలు అందించే దిశగా అంగర పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో గురువారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం సత్యవేణి అధ్యక్షతన నిర్వహించారు. అజెండాను వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి సమావేశంలో చదివి వినిపించారు. ఎంపీడీఓ కె.రత్నకుమారి, తహసీల్దార్ చిన్నారావు పర్యవేక్షణలో పలు అంశాలపై చర్చించారు. వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలపై ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నట్టు ఆసుపత్రి ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు తెలిపారు. సమావేశంలో పడమర ఖండ్రిక సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, ఎంపీడీఓ కార్యాలయ నిర్వహణాధికారి రాజశేఖర్, పీహెచ్‌సీ హెచ్ఈ బి.రామారావు, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, ఎల్‌టీ ఆలీ పాల్గొన్నారు.

వీల్‌చైర్, నిత్యావసరాల పంపిణీ

అంబాజీపేట: మాచవరం మెట్లకాలనీకి చెందిన నెల్లి బాలమురళీకృష్ణకు కాకినాడకు చెందిన కృతి ఫౌండేషన్ వీల్‌చైర్, నిత్యావసర సరకులను గురువారం పంపిణీ చేశారు. బాలమురళీ కృష్ణ గత కొంత కాలంగా అనారోగ్యంతో ఉండడంతో సాయం అందించినట్టు ఫౌండేషన్ వారు తెలిపారు.

కౌలుకోలేని రైతులు

- అందని కూటమి ప్రభుత్వ సాయం
- 9 నెలల పాలనా కాలంలో అందని భరోసా
- ప్రైవేటు అప్పులతో కౌలు రైతుల ఇబ్బందులు



సమావేశంలో పథకాలపై మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట (ఫైల్)

కపిలేశ్వరపురం: రైతును దేశానికి వెన్నుముఖ అంటారు. రైతు బావుంటే అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారంటారు. అయితే రైతులు ఇప్పుడు ఆందోళనలో ఉన్నారు. ఆర్థిక సాయం లేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం సాయం అందించకపోవడంతో ప్రైవేట్‌గా అప్పులు చేసి కౌలు రైతులు రబీ సాగు చేస్తున్నారు. ఈ అప్పుల ఊబిలో కూరుకుపోయి కోలుకోలేకపోతున్నారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లు రైతు భరోసా పేరుతో పెట్టుబడి సాయంగా సాగు కాలానికి ముందస్తుగానే రూ.13.500 చొప్పున రైతు కుటుంబానికి ఇచ్చింది. దాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం రూ.20వేలకు పెంచుతానంటూ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి 9 నెలలైనా రైతుకు ఒక్క రూపాయి సాయమందించిన పాపానపోలేదు. ఇక కౌలు రైతులయితే ప్రైవేటు అప్పులతో రబీని సాగు చేస్తున్నారు.

వైఎస్ జగన్‌పాలనలో కౌలు రైతుకు రైతు భరోసా ఇలా...

వైఎస్ జగన్ ప్రభుత్వం సాధారణ రైతుకు సాయమందిస్తున్న తీరుగానే ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల కౌలు రైతులకు డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసాను అమలు చేసింది. సాధారణ రైతులకు అందజేస్తున్నట్టుగానే ఏడాది కాలంలో రూ.13,500 చొప్పున చెల్లించింది. 2023-24 సీజన్‌కు సంబంధించి తొలి విడతగా 7,500 చొప్పున రైతుల ఖాతాలకు జమ చేసింది. అప్పట్లో జిల్లాలో 5,505 మందికి రూ.4,12,87,500 మేర లబ్ధి చేకూర్చింది.

2023లో కౌలు రైతులకు వైఎస్ జగన్ రైతు భరోసా తొలివిడత సాయమిలా

మండలం	కౌలు రైతులు	అందుకున్న లబ్ధి
మండపేట	259	రూ. 19,42,500
రాయవరం	972	రూ. 72,90,000
కపిలేశ్వరపురం	465	రూ. 34,87,500
రామచంద్రపురం	916	రూ. 68,70,000
కె.గంగవరం	989	రూ. 74,17,500
మొత్తం	3,601	రూ.2,70,07,500

కౌలు రైతుకు భరోసానివ్వని కూటమి ప్రభుత్వం

రాష్ట్రంలో 25 లక్షల మంది కౌలు రైతులుండగా అత్యధిక సాగుభూమిని కౌలు రైతులే సాగు చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక కౌలు చట్టాన్ని రూపొందించి విజయవంతంగా అమలు చేసింది. ఆ చట్టాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. కొత్త చట్టాన్ని తీసుకొస్తామంటూ కాలయాపన చేస్తోంది. అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు సైతం అమలు చేస్తామంటూ ప్రకటనలు చేసినప్పటికీ ఇప్పటి వరకూ రైతుకు పైసా సాయమందించింది లేదు. రైతు సంక్షేమ ప్రభుత్వమంటూ ఉపన్యాసాలు ఊదరగొడుతున్న కూటమి నేతలు కొత్త కౌలు చట్టంపై స్పష్టతనివ్వడంలేదు. సొంత

రైతుకు అందని సాయం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎస్టీ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన కౌలు రైతులు ప్రభుత్వం నుంచి లబ్ధి పొందారు. సొంత భూమి లేని కౌలు రైతులకు ప్రభుత్వం అండగా లేకపోతే సాగు చేయలేదు. ఇప్పటి వరకూ ప్రస్తుత ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు సాయమందించే దిశగా ఆలోచన చేయలి.

– పలివెల మధు,
దళిత ఎంపీటీసీ సభ్యుడు, అచ్యుతాపురం

భూమి లేకున్నా వ్యవసాయ భూమినే నమ్ముకుని జీవిస్తున్న కౌలు రైతు దీర్ఘకాలంగా కష్ట, నష్టాలను భరిస్తూ వస్తూనే ఉన్నారు. 2014-19లోని టీడీపీ ప్రభుత్వం కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కానీ కౌలు రైతులను ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. ఆయా పాలనా కాలాల్లో ప్రభుత్వ లబ్ధి అందక సతమతమయ్యేవారు. ప్రస్తుత ప్రభుత్వం నుంచి భరోసా లేకపోవడంతో ప్రైవేటు అప్పులతో పంట సాగు చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కౌలు రైతుకు మేలు చేయాలన్న తపనతో అనేక సంక్షేమ పథకాలను అమలు చేసింది. భూమి గల రైతు తమ భూహక్కులు పోతాయన్న భావనతో కౌలు రైతుకు సాగు హక్కు ఇచ్చేందుకు అంగీకరించే వారు కాదు. ఆ సమస్య పరిష్కారానికి వైఎస్ జగన్ ప్రభుత్వం 11 నెలల సాగు హక్కు కల్పిస్తూ ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది. దీని ద్వారా భూమి గల రైతుకు చట్టపరమైన చిక్కులేమీ తలెత్తవు. స్వేచ్ఛగా కౌలు చేస్తున్న రైతుకు పంట సాగుదారు హక్కు పత్రాన్ని (సీసీఆర్సీ) ఇచ్చేందుకు సంసిద్ధమయ్యేరు. ప్రభుత్వ కృషి ఫలితంగా మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో 3,601 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ కౌలు రైతులు రైతు భరోసా సాయాన్ని పొందగలిగారు.

మద్యం దుకాణం పెడితే ఊరుకునేది లేదు

మండపేటలో మహిళల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న మహిళలు

మండపేట: జనావాస ప్రాంతాల మధ్యలో మద్యం దుకాణాలను తీసుకొచ్చి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడాలని చూస్తే ఊరుకునేది లేదని మండపేటలోని ఓ ప్రాంత మహిళలు హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త మద్యం పాలసీ విధానం ద్వారా కల్లుగీత కార్మికులకు ప్రత్యేకంగా వైన్‌షాపులను అప్పగించారు. మద్యం పాటల నిర్వహణలో షాపు దక్కించుకున్న సదరు యజమాని మండపేటలో షాపు ఏర్పాటుకు సమాయత్తమయ్యారు. 28, 29 వార్డుల పరిధిలోని సప్తగిరి థియేటర్ ఎదురుగా షాపు నెలకొల్పేందుకు నిర్వాహకుడు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండు వార్డులకు చెందిన ప్రజలు తమ ప్రాంతంలో షాపు ఎట్టిపరిస్థితిలోను పెట్టడం కుదరదంటూ షాపు ఎదుట ధర్నా చేపట్టారు. 28, 29, 30 వార్డుల కౌన్సిలర్లు మద్దతుగా నిలిచారు. అధిక సంఖ్యలో మహిళలు రోడ్డెక్కడంతో వారికి కౌన్సిలర్లు, టీడీపీ నాయకుడు షేక్ ఇబ్రహీం కూడా సంఘీభావం తెలిపి అండగా నిలిచారు. రోడ్డు బైఠాయించి నివాస ప్రాంతాల మధ్య మద్యం దుకాణం పెట్టడం కుదర దంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రజల ఆమోదం లేనప్పుడు మద్యం దుకాణం ఎలా ఏర్పాటు చేస్తారని మహిళలు ప్రశ్నించారు. ఈ సందర్భంగా మొండి మురళి, పిల్లి శ్రీనివాస్, మారిశెట్టి సత్యనారాయణలు మాట్లాడుతూ గతంలో మద్యం దుకాణాలు ఊరి చివర్ల ఉండేవన్నారు. ఇప్పుడు జనావాసాల్లోకి చొచ్చుకుని రావడంతో గొడవలు జరుగుతున్నాయన్నారు. మహిళలకు ఇబ్బందిగా ఉందని తెలిపారు. ఈ మేరకు కమిషనర్, తహశీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లోను వినతి పత్రాలు అందజేశారు. మద్యం దుకాణం అంశం తమక సంబంధం లేదని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లండని కమిషనర్ అన్నారని వారు తెలిపారు. కార్యక్రమంలో గుత్తుల బాబి, రెడ్డి రత్తయ్య, నల్లి బేబీరాణి, సుంకర సత్యనారాయణ, వనపర్తి చిరంజీవి, మదురి సిద్ధు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

పారదర్శకంగా భూసర్వే

ఆర్డీఓ అఖిల



టేకిలో మాట్లాడుతున్న ఆర్డీఓ అఖిల

కపిలేశ్వరపురం: ప్రభుత్వం చేపట్టిన భూ సర్వేను పారదర్శకంగా నిర్వహించనున్నట్టు రామచంద్రపురం ఆర్డీఓ అఖిల తెలిపారు. టేకిలో గురువారం భూ సర్వే నిర్వహించే తీరుపై భూయాజమానులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఆర్డీఓ అఖిల మాట్లాడుతూ సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. గతంలో చేసిన సర్వేలోని సాంకేతిక సమస్యలను సరిచేసేందుకు సిబ్బంది కృషి చేస్తారన్నారు. ప్రతి భూమి తాలూకు వివరాలను సక్రమంగా రికార్డుల్లో పొందుపర్చే లక్ష్యంతో భూ సర్వే చేపట్టామన్నారు. సర్వే అధికారులు పిలిచినప్పుడు భూయాజమానులు సకాలంలో హాజరై సర్వేకు సహకరించాలన్నారు. వివాదాస్పద అంశాలను సంబంధిత అధికారుల సమక్షంలో చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. ప్రస్తుత సర్వే ద్వారా వివాద రహిత రికార్డులను యాజమానులకు అప్పగిస్తామని డీఐఓఎస్ శ్రీనివాస్ అన్నారు. సదస్సులో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచి కుక్కల నాగమణి, తహశీల్దార్ చిన్నారావు, ఆర్ఐ అర్జమ్మ, సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాస్, గ్రామస్తులు దాసరి శ్రీనివాస్, మేడిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలు స్వర్ణాంధ్రకు సోపానాలు

- ఎక్సైజ్ అధికారి ఎస్‌కేవీడీ ప్రసాద్
- ద్వారపూడిలో సారా నిర్మూలన సదస్సు



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

మండపేట: సారా రహిత గ్రామాలు స్వర్ణాంధ్రకు సోపానాలవుతాయని మద్యం ఎక్సైజ్ అధికారి ఎస్‌కేవీడీ ప్రసాద్ అన్నారు. ద్వారపూడి శ్రీచేకూరి కాశీవిశ్వనాథరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నవోదయం సారా నిర్మూలన సదస్సు నిర్వహించారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సారా నిర్మూలన సదస్సులో ఆయన మాట్లాడుతూ సారాను పూర్తిగా అపరిశుభ్ర అశాస్త్రీయ పద్ధతుల్లో తయారు చేస్తారన్నారు. నాటు తయారీకి ఎక్కువగా విషపూరిత రసాయనాలు వినియోగిస్తారని, ఆరోగ్యం పూర్తిగా పాడైపోతుందని అన్నారు. సారా వల్ల ఆర్థిక వ్యవస్థ కూడా దెబ్బతిని కుటుంబాలు చిన్నాభిన్నమైపోతున్నాయన్నారు. అనంతరం సారాకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ప్రధానోపాధ్యాయుడు సవితాల సుబ్రహ్మణ్యం, రూరల్ సీఐ పీ దొరరాజు, ఆలమూరు ఎక్సైజ్ సీఐ ఐ.దుర్గానాగేశ్వరరావు, రూరల్ ఎస్ఐ బుచ్చిబాబు, ఎక్సైజ్ ఎస్ఐ రాంబాబు, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి గండి స్వామి ప్రసాద్, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్-2025 అవార్డు సొంతం చేసుకోవాలి

- అధికారులు మరింతగా కృషి చేయాలి
- కమిషనర్ రంగారావు



స్వచ్ఛ సర్వేక్షన్ నిబంధనలు తెలియపరుస్తున్న కమిషనర్

మండపేట: మండపేట పురపాలక సంఘాన్ని అన్ని రకాలుగా తీర్చిదిద్ది స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రాష్ట్రంలోనే నంబర్ వన్ అవార్డు సొంతం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 2024-25 స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులకు పురపాలక సంఘం పోటీపడుతోంది. సర్వేక్షన్‌లో గతంలోను అవార్డులు సొంతం చేసుకున్న చరిత్ర మండపేట మున్సిపాలిటీకి ఉంది. తాజాగా కేంద్రం ప్రకటించిన సర్వేక్షన్ అవార్డులు సాధించాలనే పట్టుదలతో మున్సిపల్ అధికారులు ఉన్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు పాల్గొని సూచనలు పాటించారు. పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలన్నారు. తడి చెత్త, పొడి చెత్త, వర్మీ కంపోస్ట్, ప్లాస్టిక్ నిర్మూలన, సీఅండ్‌డీ వేస్ట్ వంటి స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారులు మరింతగా కృషి చేసి మండపేటను ఇతర మున్సిపాలిటీలకు తలమానికంగా నిలిచేలా పాటుపడాలన్నారు. 30 వార్డుల్లో ఉన్న వీధులన్నీ శుభ్రతతో ఉండాలని సూచించారు. సమావేశంలో డీఈ కే శ్రీనివాస్, ఏఈలు పవన్‌కుమార్, బీ ఆంజనేయులు, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి

శిథిలావస్థకు చేరిన మొగలిపాలెం-శీల లింకు రోడ్డు



గోతులతో ఉన్న మొగలిపాలెం- శీల లింక్‌రోడ్డు

కాజులూరు: మండలంలోని మొగలిపాలెం - శీల గ్రామాల మధ్య ఉన్న లింక్‌రోడ్డు శిథిలావస్థకు చేరుకుని అధ్వానంగా తయారైంది. కోరంగి కెనాల్ నుంచి శలపాక చానల్ కాలువ గట్టును ఆనుకుని ఉన్న ఈ రోడ్డును గత కొన్నేళ్ల క్రితం ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రావెల్ మట్టి వేసి అభివృద్ధి చేశారు. నిర్మాణ సమయంలో నాణ్యత ప్రమాణాల లోపం కారణంగా నిర్మించిన ఏడాది కాలానికే రోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. రహదారి మధ్యలో పలు చోట్ల పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో ట్రాక్టర్, ఆటో వంటి వాహనాలతోపాటు సైకిల్, మోటారు సైకిల్ వంటి వాహనాలు సైతం ప్రయాణించేందుకు వీలులేకుండా పోయింది. మండలంలోని శీల లంక, ఒంటితాడి, శీల, మంజేరు గ్రామాల ప్రజలు మొగలిపాలెం మీదుగా గొల్లపాలెం, కాకినాడ చేరుకునేందుకు ఈ లింక్‌రోడ్డు దగ్గర మార్గంగా ఉంటుంది. రోడ్డు పొడవునా నిలువెత్తు గోతుల ఏర్పడగా, పలు చోట్ల కాలువకోతకు గురవడంతో వాహనాల రాకపోకలకు అవకాశం లేకుండా పోతుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గేట్‌లో సత్యనిశాంత్‌కు 142వ ర్యాంకు



గోపి సత్య నిశాంత్

కె.గంగవరం: కుందూరు గ్రామానికి చెందిన గోపి ఏడుకొండలు, వెంకట రామదుర్గ దంపతులు కుమారుడు గోపి సత్య నిశాంత్ బుధవారం ప్రకటించిన గేట్ ఫలితాల్లో అత్యంత ప్రతిభ కనబరచి 142 వ ర్యాంకు సాధించాడు. దేశవ్యాప్తంగా 30,50,000 మంది రాసిన గేట్ పరీక్షలో ఈఈ విభాగంలో నిశాంత్‌కు 142వ ర్యాంకు వచ్చింది. ఇంటర్మీడియెట్‌లో 976 మార్కులు సాధించి, జేఈఈ మెయిన్స్‌లో 653వ ర్యాంకుతో ఇండోర్ ఐఐటీలో సీటు సాధించాడు. తరువాత రూ.20 లక్షల వార్షిక ఆదాయంతో ఉద్యోగం సంపాదించిన నిశాంత్ ఏడాది తరువాత ఉన్నత చదువు కోసం ఉద్యోగం వదిలివేసి ఏడాదిగా శిక్షణ పొందుతూ ఐఈఎస్ సాధించాలనే లక్ష్యంతో చదువుతుండగా ఆయన రాసిన గేట్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించడంపై బంధువులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిశాంత్, తల్లిదండ్రులకు అభినందనలు తెలుపుతున్నారు.

శివారు భూములకు సాగునీరందించాలి

కాజులూరు: శివారు భూములకు సాగునీరందించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు తదితరులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని గ్రామాలలో కౌలురైతు సంఘం నాయకులు పర్యటించి నీటి ఎద్దడికి గురవుతున్న వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఒంటితాడిలో ఆయన మాట్లాడుతూ నీటి ఎద్దడి నేపథ్యంలో తూర్పుడెల్టా కాలువ శివారు భూముల్లో ఉన్న కాజులూరు మండల గ్రామాలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడిందన్నారు. అధికారులు సాగునీటి సరఫరాలో కాలువ శివారు భూముల పోలాలకు ప్రాదాన్యతను ఇవ్వటంతో పాటు పత్యామ్నయ చర్యలపైనా దృష్టిపెట్టాలన్నారు. కార్యక్రమంలో మండల కౌలు రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో ఉచిత దంత వైద్య శిబిరం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని భీమేశ్వర దంత వైద్యశాల వైద్యుడు డాక్టర్ బచ్చు క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. దంత సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతిరోజు రెండు పూటలా బ్రష్ చేయాలని, సంవత్సరానికి ఒక్కసారైనా దంత వైద్యులను సంప్రదించి నోటి క్లీనింగ్ చేయించుకోవడంతో పాటు ఏవైనా వ్యాధులు ఉంటే ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి తగిన వైద్యం చేయించుకోవాలని సూచించారు. అనంతరం రోగుల దంతాలను పరీక్షించి అవసరమైన వారికి మందులు, టూత్ పేస్టులు అందజేశారు.

మండలస్థాయి కవితల పోటీలు

ఆలమూరు: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీమతి అంగర లక్ష్మీ కాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వహిస్తున్న బాలమందిరం ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఉగాది కవితల పోటీలు నిర్వహించనున్నట్టు వ్యవస్థాపకులు కృష్ణశ్రీ తెలిపారు. సంధిపూడిలో ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు అంగర శ్రీనివాసు అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణశ్రీ పాల్గొని ప్రసంగించారు. విశ్వావసు-విశ్వశాంతి అనే అంశంపై ఈ కవితల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అర్హులైన ఆసక్తి కలిగిన కవులు ఈ పోటీల్లో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కవితలను 9963163136 నంబరుకు ఈనెల 27వ తేదీలోపు పంపించాలని ఆయన కోరారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన లారీ

అంబాజీపేట: అతివేగం, నిర్లక్ష్యం కారణంగా గురువారం అర్ధరాత్రి సమయంలో లారీ రోడ్డు పక్కను ఉన్న విద్యుత్ స్తంభాన్ని, శ్రీ కృష్ణుడి ఆలయ మెట్లను ఢీ కొట్టడంతో ధ్వంసమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... అంబాజీపేట శివారు స్టీల ఆస్పత్రి సమీపంలో దొమ్మేటివారిపాలెం వద్ద రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని లారీ బలంగా ఢీ కొట్టడంతో స్తంభం పూర్తిగా ధ్వంసమైంది. అక్కడే ఉన్న శ్రీకృష్ణుడు ఆలయ ప్రాంగణంలో ఉన్న చేతి పంపు, మెట్లను ఢీ కొట్టడంతో ధ్వంసమయ్యాయి.

ఘనంగా కోదండ రాముడి విగ్రహ ప్రతిష్ఠ



రామాలయంలో పూజలు చేసిన పిల్లి సూర్యప్రకాశ్, ఆలయ కమిటీ సభ్యులు

కె.గంగవరం: దంగేరు చెరువుగట్టు పేటలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘ పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్యాన్సర్ సర్వేకు సహకరించండి



చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: మున్సిపల్ పరిధిలోని 30 వార్డుల్లోను క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తించేందుకు సర్వే జరుగుతుందని, ఈ సర్వేకు వస్తున్న ఆరోగ్య సిబ్బందికి, ఉద్యోగులకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి కోరారు. గురువారం చైర్‌పర్సన్ దుర్గారాణి మీడియాతో మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్యాన్సర్ నిర్మూలించేందుకు సర్వే ప్రారంభించాయన్నారు. ఎన్‌సీడీసీడీ సర్వే పేరుతో పట్టణంలోని ప్రతి ఇంటికీ వైద్య ఆరోగ్య సిబ్బది వస్తున్నారని, వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం మివ్వాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా మహిళల కోసం సర్వే నిర్వహించామన్నారు. దీనివల్ల క్యాన్సర్ మహమ్మారిని మొదటి దశలోనే గుర్తించడానికి దోహద పడుతుందన్నారు. నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఒక్కరూ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. హెల్త్ సూపర్ వైజర్ అనంతలక్ష్మి, హెల్త్ సెక్రటరీ మాధురిక, ఆశ కార్యకర్త ఉమాదేవి తదితరులు గురువారం పలు వార్డుల్లో పర్యటించి సర్వే నిర్వహించారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న వీరబాబు

మండపేట: మార్చిలోనే ఎండలు మండుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 10: 30 గంటలకే సూర్యభగవానుడు భగ్గుమంటున్నాడు. దీంతో ప్రజలు, చిన్నారులు, వృద్ధులు మగ్గిపోతున్నారు. పరీక్షలు రాసే విద్యార్థులు సైతం పరీక్షా కేంద్రాల్లో ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో వివిధ రకాల పనుల నిమిత్తం మార్కెట్లోకి వచ్చే ప్రజలకు దుర్గా డైరీ నిర్వాహకులు గురువారం మజ్జిగ ప్యాకెట్లు పంచిపెట్టారు. వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ పిల్లా వీరబాబు ఆధ్వర్యంలో నిర్వాహకులు బురుగుంట చెరువు వైఎస్సార్ పార్కు ఎదురుగా ఉన్న దుర్గా డైరీ షాపు బయట స్టాల్ ఏర్పాటు చేసి బాటసారులకు దాహార్తిని తీర్చారు.

మద్యం సీసాల ధ్వంసం



మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న పోలీసులు, ఎక్సైజ్ అధికారులు

రామచంద్రపురం: స్థానిక డివిజన్ పరిధిలో 2021-22 సంవత్సరాల్లో వివిధ కేసుల్లో పట్టుకున్న మద్యం సీసాలను పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఆధ్వర్యంలో గురువారం ధ్వంసం చేశారు. స్థానిక రైల్వే స్టేషన్ వద్ద 92 కేసులు మద్యం బాటిళ్లను ఈ సందర్భంగా ధ్వసం చేశారు. రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, సీఐ వెంకటనారాయణ, ఎస్సై ఎస్.నాగేశ్వరరావు ఇతర పోలీస్ సిబ్బంది, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.